క్లుప్తంగా

సుబ్రమణ్యం సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: వైఎస్సార్‌సీపీకి నాయకుడు మర్రి సుబ్రమణ్యం సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. పుత్తూరు రూరల్ మండలం తడుకు పంచాయతీ వేణుగోపాలపురం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుబ్రమణ్యం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని వేళలా వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఇంకా పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ముగిసిన కొల్లాగుంట జాతర



గ్రామ వీధుల్లో ఊరేగుతున్న గంగమ్మ

కార్వేటినగరం: మండలంలోని కొల్లాగుంటలో నడివీధి గంగమ్మ జాతర బుధవారం కోలాహలంగా ముగిసింది. చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి పక్కనే ఉన్న పడివేటమ్మ ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు వండి, పిండిదీపాలతో నైవేద్యం సమర్పించారు. అలాగే మంగళవారం రాత్రి కనక మేడాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని నడివీధి గంగమ్మను పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టారు. మహిళలు వెయ్యికళ్ల దుత్తలు మోసి మొక్కులు చెల్లించారు. యువత వివిధ రకాల వేషధారణతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శ్మశానంలో క్షుద్రపూజల కలకలం



మర్రిపల్లె శ్మశానంలో క్షుద్ర పూజల ఆనవాళ్లు

శ్రీరంగరాజపురం: మండలంలోని మర్రిపల్లె గ్రామం సమీపంలోని శ్మశాన వాటికలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. బుధవారం ఉదయం ఉపాధి హామీ పనుల కోసం వెళ్లిన కూలీలు శ్మశానంలో క్షుద్ర పూజల కోసం ఏర్పాటు చేసిన బొమ్మలు, పసుపు–కుంకుమలతో నింపిన నిమ్మకాయలు ఉండడం చూసి భయాందోళనకు గురై పలువురు పరుగులు తీశారు. గతంలో కూడా ఇదే శ్మశానంలో ఇలాంటి పూజలు చేశారని, రోడ్డుకు పక్కనే జన సంచారం ఉన్న ప్రాంతాల్లో ఇలాంటివి చేస్తున్న వారిని గుర్తించి, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోలింగ్ ప్రక్రియపై అవగాహన



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట శివ

గంగాధర నెల్లూరు: మాస్టర్ ట్రైనర్లు పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట శివ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మాస్టర్ ట్రైనర్ అధికారులకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం, అసలైన ఓటర్లు, బోగస్ ఓటర్లు గుర్తించడం, అందులో విభిన్న ప్రతిభావంతులు, నిస్సహాయులు , టెండర్ బ్యాలెట్, చాలెంజ్ ఓటు, పోర్ట్ పోలింగ్ ఏజెంట్ల ప్రక్రియ, పోలింగ్ పూర్తయిన తరువాత ఈవీఎం యంత్రాలకు సీలు వేయడం..ఇత్యాది అంశాలపై పీఓలు, ఏపీవోలకు శిక్షణ ఇచ్చారు. ఏఎస్ఓ ఆనంద్ మోహన్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల అధికారి రవి, ఎన్నికల డీటీ విజయకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

విధుల నుంచి ఆర్పీ తొలగింపు

నగరి : టీడీపీ, బీజేపీ కూటమితో మంగళవారం కలిసి ప్రచారంలో పాల్గొన్న నగరి మున్సిపాలిటీ కొత్తపేటకు చెందిన స్వయం సహాయక సంఘాల రిసోర్స్ పర్సన్ ధనలక్ష్మిని విధుల నుంచి తొలగించినట్లు ఎంసీసీ టీం బుధవారం ప్రకటించింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అతిక్రమించిన కారణంగా విచారణ చేపట్టిన ఎంసీసీ టీం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

మాపై ఎందుకింత కక్ష బాబూ..?

- మండిపడుతున్న పింఛనుదారులు
- పెన్షన్ల కోసం అగచాట్లు
- సచివాలయాల వద్ద పడిగాపులు

‘ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్లు.. చంద్రబాబు అధికార దాహం మా పాలిట శాపంగా మారింది. మండుటెండల్లో ముసలోళ్లని బాధపెట్టి ఏం సాధిస్తారు? మాపైనా మీప్రతాపం? 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా వెలగబెట్టినా పండుటాకుల ఇళ్ల వద్దకే పింఛన్ అందించావా! జగన్‌బాబు ఒకటో తేదీనే ఇంటి వద్దకే అందించి మాకు మేలు చేస్తుంటే, మా ముసలోళ్ల పింఛన్లు వలంటీర్లు పంపిణీ చేయకూడదంటూ ఆపించేస్తావా? ఇదా నువ్వు పేదలకు చేసే మంచి’ అంటూ సచివాలయాలకు ప్రయాసకోర్చి వచ్చిన వృద్ధుల ఆక్రోశం.. ఆవేదన. నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో బుధవారం కనిపించిన దృశ్యాలివి..



అవ్వాతాతల పడిగాపులు..



పుత్తూరు అంబేద్కర్ సచివాలయం వద్ద వృద్ధుల పడిగాపులు

పుత్తూరు: ఒకరు చేయి పట్టుకొని నడిపించుకుంటూ వస్తున్నారు. ఒకరు కాళ్లీడ్చుకొంటూ వస్తున్నారు. మరి కొందరు ఆటోలో వచ్చిదిగుతున్నారు. మరెందరో తెల్లవారు జామునే సచివాలయాల వద్దకు వచ్చి పడిగాపులు కాచారు. వీటన్నింటికీ ఒకటే కారణం. ఒకటో తారీఖున ఇంటి వద్దకు వచ్చే వలంటీర్ రాకపోవడమే. వలంటీర్ రాకపోవడానికి కారణం తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు. పనికట్టుకుని ఎన్నికల కమిషన్‌కు తన మనుషుల చేత ఫిర్యాదులు చేయించి, ఇంటింటికీ వెళ్లి పింఛను ఇవ్వకుండా ఆదేశాలిప్పించడమే. ఫలితంగా ఒక్క పుత్తూరులోనే 9,760 మంది పింఛనుదార్లను సచివాలయాల వద్దకు వ్యయ ప్రయాసాలతో రావల్సి వచ్చింది. ఇలా మాలాంటి వృద్ధులను బాధపెట్టడం ద్వారా చంద్రబాబు ఏంసాధించాలను కొంటున్నారని పలువురు పింఛనుదార్లు ప్రశ్నిస్తున్నారు. ముసలోళ్ల శాపం నీకు తప్పక తగులుతుంది అంటూ అవ్వాతాతలు గురువారం సర్వత్రా ఆక్రోశం, ఆవేదన వ్యక్తం చేశారు.



పుత్తూరులో పింఛను కోసం ఆటోలో అవస్థలు పడుతూ ..

పది కిలోమీటర్ల నుంచి వచ్చాం..



పెనుమూరు మండలం తాటిమాకులపల్లె సచివాలయం వద్ద పడిగాపుల కాస్తున్న వృద్ధులు

పెనుమూరు(కార్వేటినగరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదిరించలేక చంద్రబాబు పింఛనుదారులపై పడి కక్ష సాధిస్తున్నారని, దీనిని ఆయన అనుభవించకతప్పదని వృద్ధులు, వికలాంగులు శాపనార్థాలు పెట్టారు. పింఛన్ల కోసం పెనుమూరు మండలం తాటిమాకులపల్లె సచివాలయానికి పోలోమంటూ వచ్చారు. చిరుతని గుంట గ్రామానికి చెందిన దేవరాజులు మాట్లాడుతూ, సచివాలయాల్లో పింఛన్లు తీసుకోవాలనడంతో వృద్ధులు, వికలాంగులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నడవలేని పరిస్థితుల్లో 5 కిలో మీటర్ల దూరం నుంచి ఆటోలు ఎక్కి రావాల్సిన పరిస్థితి కలిగిందని ఆయన తన ఇక్కట్లు చెప్పారు. పలువురు వృద్ధులు మాట్లాడుతూ, తాము పదికిలోమీటర్ల దూరం నుంచి వచ్చామని, పింఛను కోసం గంటల సేపు పడికాపులు కాసినట్లు చెప్పారు.

మా ఉసురు చంద్రబాబుకు తగులుతుంది



గంగాధరనెల్లూరు: వ్యయ ప్రయాసలు కోర్చి సచివాలయానికి వస్తున్న దివ్యాంగురాలు



గంగాధరనెల్లూరు: గ్రామ సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు మండల కేంద్రంలో పింఛను లబ్ధిదారులు చంద్రబాబుపై దుమ్మెత్తి పోశారు. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు ఇచ్చేవారని, చంద్రబాబు తన చర్యలతో వారిని ఆపివేయించడంతో తమకు కష్టాలు మొదలయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: పింఛన్ల కోసం వృద్ధులు కార్యాలయాల వద్ద పడిగాపులు కాశారు. డీఆర్‌డీఏ పీడీ తులసీ చౌరవతో పింఛన్ల పంపిణీ చేశారు. తొలిరోజు వృద్ధులు, ఇటు అధికారులకు ఇబ్బందులు తప్పలేదు. తాము 5 కిలోమీటర్ల నుంచి దూరం నుంచి అవస్థలు పడుతూ పింఛన్ల కోసం వచ్చినట్లు గోడు వెళ్లబోసుకున్నారు. రాత్రి అయిన ప్పటికీ పింఛన్లను పంపిణీ చేయడం కనిపించింది.



కార్వేటినగరం: రాత్రి అయినా పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

పాలసముద్రంలో..



పాలసముద్రం: సచివాలయం పడిగాపులు

పాలసముద్రం : పింఛన్ల కోసం లబ్ధిదారులకు అగచాట్లు తప్పలేదు. బుధవారం పలు సచివాలయాలకు వ్యయ ప్రయాసలకోర్చి వచ్చిన లబ్ధిదారులు గంటల తరబడి పడిగాపులు కాశారు. వృద్ధులు, వితంతువులు , వికలాంగులు మండుటెండలో పింఛన్ల కోసంఇబ్బందులు పడ్డారు.

మట్లోళ్లపల్లె వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి

రొంపిచెర్ల: మండలంలోని బండకిందపల్లె గ్రామ పంచాయతీ మట్లోళ్లపల్లె సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బుధవారం సాయంత్రం పశువుల కాపరుల ద్వారా ఇది వెలుగులోకి వచ్చింది. వారి సమాచారంతో గ్రామ సేవకుడు ఇర్ఫాన్ అలీ రొంపిచెర్ల పోలీసులకు, తహసీల్దార్ మోహీద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఏఎస్ఐ తులసీరాం సంఘటన స్థలాన్ని ఇదేరోజు రాత్రి పరిశీలించారు. మృతుడికి దాదాపు 56 సంవత్సరాలు ఉంటాయని చెప్పారు.శవాన్ని పంచనామా కోసం అన్నమ్మయ్య జిల్లా పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రోబోటెక్ శస్త్రచికిత్సలపై వర్క్ షాప్

గుడుపల్లె: పీఈఎస్ ఆసుపత్రిలో రోబోటెక్ శస్త్రచికిత్సలపై అవగాహనకు బుధవారం వర్క్‌షాప్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్‌ఆర్ క్రిష్ణారావు ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శశికిరణ్ జీర్ణాశయాంతర రోబోటెక్ శస్త్ర చికిత్సల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, చిదంబరరావు, మోహన్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



వర్క్‌షాపును ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ క్రిష్ణారావు

విశ్వసనీయతకు మారు పేరు డిప్యూటీ సీఎం

- మీలా పేదల రక్తంతో చెలగాటం ఆడడం లేదు
- థామస్‌పై నిప్పులు చెరిగిన డిప్యూటీ సీఎం కుమార్తె ఇందిరా ప్రియదర్శిని



ఇందిరా ప్రియదర్శిని

కార్వేటినగరం: విలువలకు, విశ్వసనీయతకు మారు పేరు తన తండ్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అని ఆయన ద్వితీయ కుమార్తె డాక్టర్ కళత్తూరు ఇందిరా ప్రియదర్శిని అన్నారు. బుధవారం జర్మనీ నుంచి ఒక వీడియోను విడుదల చేశారు. ఆమె మాటల్లోనే..‘‘ నాడు మా నాన్న సర్పంచ్ స్థాయి నుంచి ఇప్పుడు డిప్యూటీ సీఎం స్థాయికి ఎదిగి ఆదర్శంగా నిలుస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ చదువుకున్న వ్యక్తిగా మాట్లాడుతున్నారో లేక డబ్బు గర్వంతో మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. వయస్సులో పెద్ద వారైన నారాయణస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం వినాశనానికి తొలిమెట్టు. మా తండ్రి అవినీతి పరుడని, నీవు ఆధారాలతో నిరూపిస్తే మా కుటుంబం మొత్తం నియోజకవర్గం ప్రజలకు క్షమాపణ చెప్పి శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటాం.. నువ్వు నిరూపించపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటావా? మొదటి నుంచి విలువలతో కూడిన రాజకీయం చేస్తున్నారు కాబట్టి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారు. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిప్యూటీ సీఎం పదవితో గౌరవించారు. మీలా పేదల రక్తంతో చెలగాటమాడి ఒక బిడ్డ కాన్పునకు ప్యాకేజీ రూపంలో రూ.లక్షలు దోచుకుంటున్న నువ్వా మా నాన్నను విమర్శించేది? అంతెందుకు.. మీ సొంత ఊరిలో అందరికీ ఇళ్ల స్థలాలతో పాటు భూ పంపిణీ చేసింది కూడా మానాన్నే. సమితి అధ్యక్షుడిగా భూ పోరాటాలు చేసి 40 వేల ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టిన ఘనత ఆయనది. అలాగే దళితవాడకు శ్మశాన వాటికలూ ఏర్పాటు చేశారు. ప్రతి పేదవాడు చదువుకోవాలని మానాన్న పాదిరికుప్పం దళితవాడలో కట్టించిన ఉన్నత పాఠశాలలోనే కదా నీవూ చదివింది. నీవా ఆయన గురించి విమర్శించేది? రూ.1.250 కోట్లతో రోడ్లు వేయించారు. ఆలయాలకు నోచుకోని 87 దళిత వాడల్లో ఆలయాలు నిర్మించారు. కార్వేటినగరం, పెనుమూరు మండలాల్లో 50 పడకల ఆస్పత్రి తీసుకొచ్చారు. కుశస్థలీ నదిపై రూ.27 కోట్లతో ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, 216 ఓహెచ్‌ఆర్ వాటర్ ట్యాంకులు, టీటీడీ కల్యాణ మండపాల నిర్మాణాలు, దేవదాయశాఖ శాఖ ద్వారా 23 పురాతన ఆలయాల పునర్నిర్మాణం చేశారు. పలు ఆలయాలను టీటీడీలో విలీనం చేయించి అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. థామస్‌లా పేదల జీవితాలతో మా కుటుంబం ఏరోజూ ఆడుకోలేదు. మానాన్నను విమర్శించే అర్హత థామస్‌కు లేదు..మరోసారి నోటి కొచ్చినట్లు మాట్లాడితే మంచిది కాదు’’ అని ఇందిరా ప్రియదర్శిని హెచ్చరించారు.

మీ అభిమానం చల్లంగుండా..!



సభా ప్రాంగణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివాదం



జై జగనన్న..



టవర్ ఎక్కిన అభిమానం



మేమంతా మీవెంటే... అశేష జనం

పూతలపట్టు: మిట్ట మధ్యాహ్నం మండుతున్న ఎండల్లో రోడ్డుకు ఇరువైపులా మాత్రమే కాస్త నిలువ నీడ ఉంది. అయితే పూతలపట్టుకు జగనన్న రాక ఓ పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. పిల్లా పాపల నుంచి ముసలి ముతక వరకు పాలకల సంతగేటు నుంచి క్యూకట్టారు. కొందరు ఇంటి మిద్దెలపై నుంచి ఎదురుచూశారు. నూతనంగా నిర్మించిన ఆర్చిపైకి ఎగబడ్డారు. చెట్ల కొమ్మల నుంచి తొంగిచూసేందుకు ఎగబడ్డారు.

జనసంద్రంగా మారిన పూతలపట్టు

మేము సిద్ధం–బస్సుయాత్రలో భాగంగా బుధవారం పూతలపట్టు మండలానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేశారు. మొదట అభిమానులు, నాయకులు పాటూరు వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం బైకుల ద్వారా బస్సు వెంటే యాత్రను కొనసాగించారు. మధ్యాహ్నం తేనేపల్లి టోల్‌ప్లాజా వద్ద భోజనం ముగించుకొని సాయంత్రం గోపాలపురం వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు హాజరయ్యారు. సభ విజయవంతం కాగా వైఎస్సార్‌సీపీ నాయకుల్లోమరింత ఉత్సాహం నెలకొంది.



అభిమాన నేతకు ఆత్మీయ స్వాగతం

9న ఉగాది వేడుకలు

కాణిపాకం (చిత్తూరు రూరల్): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఈనెల 9వ తేదీన ఉగాది వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం శ్రీస్వామివారికి అభిషేక ప్రత్యేక అభిషేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు పంచాంగ శ్రవణం జరుగుతుందన్నారు. అశేషంగా విచ్చేసే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

చిత్తూరు కార్పొరేషన్: రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గుంతకల్లు డివిజన్ డీఆర్‌ఎం వినీత్‌సింగ్ బుధవారం పరిశీలించారు. ప్లాట్‌ఫాం, లిఫ్ట్ పనులు, పార్శిల్ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న విద్యార్థులతో వసతుల గురించి మాట్లాడారు. లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని కోరగా త్వరలో అందుబాటులోకి వస్తుందన్నారు. చిత్తూరు–చెన్నైకు రైలు సదుపాయం కల్పించాలని స్మార్ట్ సిటీ సభ్యులు కోరారు. చిత్తూరు మీదుగా వెళ్లే ఆరు రైళ్లు ఇక్కడ ఆపడం లేదని సమస్యను తెలిపారు. పీసీఆర్ పాఠశాల, అంబేద్కర్ భవన్ సమీపంలో రైల్వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

అంతా గోప్యత

చిత్తూరు రైల్వేస్టేషన్‌లో అమృత్‌భారత్ కింద దాదాపు రూ.14 కోట్లతో ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. వీటి పర్యవేక్షించడానికి ఉన్నతాధికారులు వస్తుంటారు. వారు వచ్చినప్పుడు ముందస్తు సమాచారం ఎవరికీ ఇవ్వడం లేదు. ఇస్తే స్థానికంగా రైల్వేస్టేషన్‌లో నిర్వహణ లోపం, పలు రైళ్లు ఇక్కడ ఆగడం లేదని ఫిర్యాదులు చేస్తుంటారు. ఆ ఉద్దేశంతో సంబంధిత అధికారులు సమాచారం చెప్పడం లేదనే అపవాదు ఉంది.